# హన్నా!! హన్నా!!



షీలా శివరామ్

భోరున వాన కురుస్తున్నా సరే, హోరువ గాలి వీస్తూన్నా, ఎండ మండిపోతున్నా సరే, సరిగ్గా తొమ్మిదిన్నర కల్లా ఆ వీధిలోని ఆడ వాళ్ళకళ్ళన్నీ కిటికీ కంతల్లోంచి, తలుపు సందుల్లోంచి ఆ యింటివైపే చూస్తూ వుంటాయి ఆతృతగా. ఆ నల్లని పొడుగాటి కారు రాజహంసలా వచ్చి ఆగటం, ఆ పిల్ల అతి వయ్యారంగా చేతిలోని బేగ్ వూపుకుంటూ వచ్చి కారెక్కడం, మరుక్షణం కారు ఆఘమేఘాల మీద కనుమరుగవటం అంతా క్షణాల్లో జరిగి


పోతుంది. ఆడ జనాభా అంతా తలుపు ల్నించి, కిటికీల్నించి వూడిపడతారు.

'మాయదారి కాలం మండిపోతోంది! హవ్వ! హవ్వ! ఎంత ఆఫీసరయినా తండ్రంత వయసువాడు. వాడితోనా!! ఛీ! ఛీ! ముదనష్టపు జన్మ! మాయదారి చదువులు. పాపిష్టి కాలం.' అంటూ తుపుక్కున వుమ్మేస్తారు బామ్మ గారు.

'పెద్ద రోగం కదుటండీ? తండ్రి నిక్షేపంలాగా పెళ్ళి చేస్తానే తల్లీ అంటే వినకుండా తెయ్యిమని వెలుగుతోంది వుద్యోగం, వుద్యోగం అని. దీని బొంద వుద్యోగం. నేను చేస్తా ఇలాటి వుద్యోగాలు లక్షా తొంభై - మానం, అభిమానం వదిలేస్తే సరి!, అంటూ మొహం వికృతంగా చేసుకుంటుంది ఆది లక్ష్మమ్మ.

'ఎంత 'సెక్రేటరీ' అయితే మటుకు ఇలాంటి భోగం ఎంతమందికి పడుతోంది పిన్నిగారూ! తంచనుగా నిముషం అటు ఇటు గాకుండా ఆ 'బాసు' గారొచ్చి వాలడం, ఇది ఇలా ఎక్కి ఆలా ఝూమ్మంటూ పది మైళ్ళు చల్లగాల్లో షికారు కొడుతూ పనికెళ్ళడం ఆహా ఏం అదృష్టం! ఏవదృష్టం!' అంటూ అదృష్టం అర్థాన్ని శ్లేషగా మారుస్తుంది అనసూయ.

'మరీ అంత వాగాయిత్యమా! ఆ పవిట ఒంటి పొరన ఏడవకపోతే ఏం!



నిండుగా కప్పుకు చావరాదూ! అసలా ముసలాడి పెళ్ళాం ఇదంతా ఎలా భరిస్తోందో? నేనయితేనా ఆ చెంపా ఈ చెంపా వాయించి బయట కీడ్చి

పారేద్దును.' అంటుంది కసిగా అను మానపు మొగుడున్న అంబిక.

ఎండనక, వాననక బస్సులకోసం పరిగెత్తి, పడిగాపులు పడే కుర్రకారంతా దేముడిని ఒకటే కోరుతూ వుంటారు. 'భగవంతుడా ! వచ్చే జన్మలోనన్నా పిల్లగానే పుట్టించి, అదే వుద్యోగం ఆ ముసలాడి కిందే ఇప్పించి, అలా హాయిగా పొద్దునా సాయంత్రం జాలీగా కార్లో ఎక్కి మరింత జాలీగా వుద్యోగం చేస్తూ, అందరూ ఆ పిల్లని చూస్తున్న ఈర్ష్యాదృక్కులతోనే నన్ను గూడా చూసేట్టుగా అనుగ్రహించు స్వామీ' అంటూ కనపడిన, కనపడని దేముళ్ళకి మొక్కుతూ వుంటారు.

* * *

వున్నట్టుండి ఓ విచిత్రం జరిగింది. ఆ పిల్ల ఇల్లు తిరనాళ్ళు లాగా తయారయింది.

ఏనాడూ ఆ పిల్ల ఇంటి గుమ్మం తొక్కని బామ్మగారు ఆయాసపడుతూ వచ్చి, మెత్తటి దిండున్న కుర్చీలో అనుకు కూర్చుని ఆయాసం తీర్చుకుంటూ 'బావున్నావామ్మా ? ఇవాళ సెలవా ఏవిటి ?' అంటూ ఆప్యాయంగా పలకరించారు.

'బాగానే వున్నా బామ్మగారు ! ఏమిటి అపురూపంగా వచ్చారు !' అంటూ మర్యాద చేసిందా పిల్ల.

'మరేం లేదే అమ్మాయి ! ఒంటరి దానివి ఏం వొండుకుంటున్నావో, ఏం తింటున్నావో, అని చూచిపోదామని వచ్చా' అన్నారు బామ్మగారు చనువుగా.

'చెప్పండి' అందా పిల్ల వినయంగా.

మీ ఆఫీసులో ఏదో ఖాళీ వుందిటగా తల్లీ ? మా అబ్బిగాడు డ్రైవు పేసయి ఏడాదిగా పనికోసం చూస్తున్నాడు. నీ కడుపు చల్లగా ఆదేమయినా మా వాడికి వచ్చేట్టుగా చేస్తావేమోనని' అన్నది బామ్మగారు ప్రేమగా.

'ఓహో ! అదా ! దానికి ఇంటర్వ్యూ వుంది బామ్మగారూ. చాలామంది వస్తారు. మీ అబ్బిగారికి అర్హతులుంటే తప్పకుండా వస్తుంది' అందా పిల్ల.

"ఈ రోజుల్లో అర్హత లెవరిక్కావాలే అమ్మాయ్. రేపు నిన్ను పెళ్ళాడబోయే మొగుడు నువ్వెంత బాగా వంకాయ కూర వండగలవు అని చూస్తాడా ? సంపాదిస్తున్నావని చూస్తాడు గానీ ! కాస్త ఈ సహాయం చేస్తివా నీ పుణ్యం పూరికే పోదు తల్లీ ! మా అబ్బిగాడు నీ కడుపున పుడతాడే తల్లీ !, అంటూ ప్రాధేయపడసాగారు బామ్మగారు.

'ఏమిటీ ? అబ్బిగాడే..నా కడుపునే.. అమ్మో అలాగే బామ్మగారూ అలాగే... తప్పకుండా ప్రయత్నిస్తాను.' అందా పిల్ల గాభరాగా. బామ్మగారు చిరునవ్వుతో సెలవు తీసుకున్నారు. 'ఈ పూట కూరా, నారా చేసుకోకు. పప్పు,

కూరా, పచ్చడి, నేను పంపిస్తా గానీ' అంటూ ఓ కేక పెట్టారు వెనక్కి తిరిగి.

* * *

పెరటి తలుపు నెట్టిన చప్పుడయింది. ఛీ ఛీ వెధవ కుక్క అంటూ ఆ పిల్ల వంటగదిలోకి వచ్చి చప్పున నాలిక్కొరుక్కుంది. ఆ వచ్చింది కుక్క గాదు. తలుపు సందుల్నించి తల లోపలికి పెట్టి చూస్తున్న ఆదిలక్ష్మమ్మ పిన్నిగారు.

ఇదుగో! ఏం చేస్తున్నావమ్మాయ్! మా ఇంట్లో సింగపూరు అరటి గెలేసింది. చూడు పళ్ళు మంచి బలంగా ఎదిగాయి. ఇవిగో, వుంచు నాలుగు రోజులు తిందు గానీ' అంటూ వచ్చారు ఆదిలక్ష్మమ్మ గారు.

'రండి. రండి పిన్నిగారూ' అంటూ ఆహ్వానించిందా పిల్ల.

'ఏవిటి ఎక్కడా కనిపించటంలేదే మమ్మాయ్! అయినా నీకు పనిలో క్షణం తీరిక వుండదయ్యె మా లాగా తీరుబడిగా ఆశమ్మ పోశమ్మ కబుర్లు చెప్పుకోడానికి సమయం ఏది తల్లీ నీకు! ఎందుకూ? మేమూ వున్నాం! ఎప్పుడూ ఎవర్ని తిడదామా? ఎవరిమీద చాడీలు చెప్పుకుందామా' అని చూస్తూ వుంటాం. వెధవ జన్మలు అన్నది ఆదిలక్ష్మమ్మ గారు కావు ముందర జ్ఞానోదయం విజ్ఞానురాలితా గా.

'ఏమిటి మీ అభిమానం పిన్నిగారూ, అందా పిల్ల అభిమానంగా.

'ఓ మాట సహాయం నీ వల్ల కావా లమ్మాయ్. చేసి పెట్టగలవేమోనని వచ్చాను.' అన్నారావిడ నానుస్తూ.

'చెప్పండి పిన్నిగారూ!' అందా పిల్ల.

'మరేంలేదు, పెద్ద పని గాదనుకో! నీ చేతిలో పనేననుకో. మీ ఆఫీసులో ఏదో పోస్టు ఖాళీ అయిందిటగా! మా తమ్ముడి కొడుకు రెండేళ్ళుగా బి. ఏ, పాసయి ఖాళీగా వుంటున్నాడు. కాస్త నువ్వా పని మా వాడి కొచ్చేట్టుగా చూస్తావేమోనని ఆశ' అన్నదావిడ ఆశగా.

'దాందేముంది పిన్నిగారూ. అతన్ని అర్జీ పెట్టుకోమనండి అందరితోపాటు అతనికీ ఇంటర్వ్యూకి పిలుపొస్తుంది' అందా పిల్ల.

'అది సరేననుకో. ఈ రోజుల్లో ఇలాటి ఇంటర్వ్యూలు లక్షాలొంబై జరుగుతున్నాయి. ఫలితమూ ఏమున్నా నా!! నీకు కాస్త మీ ఆఫీసరుగారి దగ్గర చనువుందయ్యె. ఆయన ఓ మాటంటే ఆ వుద్యోగం వచ్చినట్టేనని మా వాడిగాడు పొద్దుటినుంచీ నన్ను చంపుకు తింటున్నాడు. 'అత్తా, పోయి ఆవిడతో ఒక్క మాట చెప్పి రావే! ఆవిడ ఊ అంటే నాకా వుద్యోగం వచ్చి

నట్టే' అంటూ పోరు పెట్టాడనుకో. పిచ్చి నాగన్న' అన్నదావిడ.

'అట్టే నా చేతిలో ఏం లేదండి' అందా పిల్ల కంగారుగా.

'అమ్మమ్మ! అలా అనకు ఇరుగు పొరుగువాళ్ళం. ఆ మాత్రం మాట సాయం చేసుకోకపోతే ఎలాగ చెప్పు' అన్నదావిడ అనునయంగా.

'అలాగే ప్రయత్నిస్తాలెండి' అందా పిల్ల చివరికి

'నీ పుణ్యం వూరికే పోదమ్మాయ్. ఈ మంచితనం వచ్చే జన్మకి దాచుకున్న ధనం అనుకో. అన్నట్టు బామ్మగారు వచ్చి వెళ్ళినట్టుందే! వాళ్ళ అబ్బిగాడికి గానీ ఆ పని ఇప్పించమనలేదు గదా!' అన్నదావిడ ఆరాగా, రహస్యంగా.

ఆ పిల్ల ఇబ్బందిగా చూసింది.

"ఇదుగో పొరపాటున వాడిగ్గానీ ఇప్పించేవు! నేను అసూయతో చెపుతున్నాననుకోకు! వాడుట్టి చవట వెధవ! ఆ బుర్రలో మట్టి తప్ప మరోటి లేదు. వాడికా పని ఇప్పించావంటే నీ కప్రతిష్ట. 'ఇలాటి చవటని ఎక్కడనుంచి పట్టుకొచ్చావమ్మా' అంటూ మీ ఆఫీసరుగారు చివాట్లేస్తారు. మా బాబిగాడికి ఇప్పించకపోయినా ఫరవాలేదు గానీ, ఆ అబ్బిగాడికి మాత్రం వేయించబోకు! నీకున్న పరువు గూడా పోతుంది. నీ మంచికోసమే చెపుతున్నానమ్మాయ్. కాస్త మా బాబిగాడి విషయం గుర్తుంచుకో, అంటూ రహస్యంగా హితవు చెప్పింది ఆదిలక్ష్మమ్మ.

'అలాగేనండి' అందా పిల్ల నమ్రతగా.

* * *

'ఇదుగో డెల్లీ' ఏం చేస్తున్నావు! ఈ దండ తీసుకో, మల్లెలు, కనకాంబరాలు విరగబూశాయి మా దొడ్లో ఏ రోజు కారోజు నీకు పంపుదామనుకోవటం. చెయ్యి వీలుగాకపోవటం. తీరా జూస్తే మీ తలుపు తాళం వేసుండటం' అంది అనసూయ బారెడు పొడుగు మల్లెదండని ఆ పిల్లకి అందిస్తూ.

'రండి కూర్చోండి అక్కయ్యగారూ' అందా పిల్ల.

'ఏమిటీ ఈ మధ్య మరీ చిక్కిపోతున్నావు! పని జాస్తిగా వుంటున్నట్టుందే! కాస్త ఆరోగ్యం కూడా చూసుకో. మీ వాళ్ళంతా ఎక్కడో దూరంలో వున్నారయ్యె నువు బాయిలా పడ్డావంటే వాళ్ళ ప్రాణాలు తల్లడిల్లిపోతాయి' అన్నది అనసూయమ్మ అతి ప్రేమగా.

'అలాగేనండి' అందాపిల్ల మొహమాటంగా

'నీకేమన్నా కావలిస్తే అడుగుతూ వుండు ఇరుగు పొరుగులం ఆ మాత్రం సహాయం చేసుకోకపోతే ఎలా! ఇహ మనం మనిషి జన్మ ఎత్తి ప్రయోజనమేమిటో చెప్పు. కొత్తావకాయ,




మాగాయ, పంపిస్తాను వేసుకో. ఏవిటి చెయి కాల్చుకుని ఏం తింటున్నావో' అంటూ విచారపడింది అనసూయ.

'ఎందుకండీ మీకు శ్రమ' అందా పిల్ల బిడియంగా.

'శ్రమేమిటి? శలేదానివే! రేపు నా కేదన్నా అవసరం వస్తే నువ్వు చెయ్యవూ! అన్నట్టు మీ ఆఫీసులో ఏదో ఖాళీ వచ్చిందిటగా చెల్లెమ్మా' అన్నది అనసూయ హఠాత్తుగా గుర్తుకొచ్చినట్టుగా.

'మరేనండీ! ఓ టైపిస్టు పోస్టు' అందా పిల్ల గోళ్ళు చూసుకుంటూ.

'ఆ, అదే నేనూ విన్నాను. మా చెల్లెలి కొడుకు ఒకడున్నాడు చెల్లెమ్మా మెరికలాంటి వాడనుకో. ప్రింటింగు మిషనులాగా టైపు కొట్టి పారేస్తాడనుకో. ఏవిటి మన దరిద్రగొట్టు దేశానికి ప్రతిభని వుపయోగించుకోవటం రాదనుకో! మూడేళ్ళుగా వుద్యోగం కోసం కాగడా వేసి గాలిస్తున్నాడు. దొరికితేనా! మా నానిగాడు పొద్దున్నే పరుగెత్తుకొచ్చాడు. 'ఏవిట్రా నాయనా ఇట్లా వచ్చావు?' అందే ఇదీ సంగతి అన్నాడు. 'ఆవిడకి ఆఫీసులో, ఆఫీసరు గారికంటె ఎక్కువ పరపతుంది. ఆవిడ కాళ్ళు గడ్డం పుచ్చుకునయినా ఈ వుద్యోగం వొచ్చేట్టు చూడు పిన్నీ' అంటూ కొరుక్కు తిన్నాడనుకో! నీ చెవిన వేసిపోదామని వచ్చా! వాడికా పనిగాని ఇప్పిస్తివా ఓ ఇంటిని నిలబెట్టిన దానవవుతావు. ఇద్దరు పిల్లలు, పెళ్ళాం తిండికి లేక అవస్తపడుతున్నారు నీ పేరు చెప్పుకుని గూట్లో దీపం పెట్టుకుంటారు.' అంది అనసూయ గుక్క తిప్పుకోకుండా.

ఆ పిల్ల అయోమయంగా నిలబడింది.

'నీ చేతిలో పని గనుక ఇంతగా ప్రాధేయపడటవమ్మాయ్. అన్నట్టు బామ్మగారు, పిన్నిగారు వచ్చినట్టున్నారే! వాళ్ళ అబ్బిగాడికి, బాబిగాడికి గానీ అడగలేదు కదా?' అన్నారావిడ ముందుకు వంగి మెల్లగా.

ఆ పిల్ల నిస్సహాయంగా నిలబడింది

'నేననుకుంటూనే వున్నాలే! అందుకే వచ్చుంటారని! ఇదుగో చూడు మా నానిగాడికి ఇవ్వకపోయినా ఫరవాలేదు గానీ వాళ్ళకి మాత్రం వేయించకోకు. నీ పరువు పోయేను! ఆ అబ్బిగాడిని కట్టుకున్న పెళ్ళామే వదిలేసింది. బుర్ర లేని వెధవని, ఏలుకోను పొమ్మంది. ఇహ వుద్యోగం ఏంచేస్తాడమ్మాయ్?! ఆ బాబిగాడున్నాడా! అడగమోకు! సకల గుణాభిరాముడనుకో! చూకావుగా వాడి వేషం! ఆఫీసులో పని చెయ్యాల్సిన వేళల్లో ఏ సందుల్లోనో గొందుల్లోనో వేళ్ళాడుతూ వుంటాడు. లేనిపోని అప్రతిష్ఠ నీకు. అపాత్ర దానం మంచిది కాదు తల్లీ, ఆలోచించుకో తల్లీ! అంటూ నిష్క్రమించింది అనసూయ.

ఆ పిల్ల తేలిగ్గా ఊపిరి విడిచింది.

* * *

అనుమానపు మొగుడు వీధి మలుపు తిరగ్గానే పరిగెత్తుకొచ్చింది అంబిక.

ఏంచేస్తున్నావు?! అబ్బో! అప్పుడే తయారయ్యావే! అన్నట్టు ఆఫీసు టయిమయింది కదూ! ఈ చీర ఎంత క్కొన్నావోయ్? అబ్బో! అంత ధరే! ఏవిటో ఏవి కట్టినా నీలాటి వాళ్ళే కట్టాలి. పోయి మసి దగ్గర ఇలాటి నాజూకు బట్టలు ఆగవనుకో! నీ లాగా చీర కట్టుకుందామని రోజూ ప్రయత్నిస్తానోయ్! కుదిరి చావందే! బొమ్మలాగా ఎంచక్కా కట్టుకుంటావో చూడు! నేనల్లా కట్టుకుందామని చూస్తే పది నెల్ల కడుపులాగా వుంటుందే తప్ప, అంచులే కనిపించి చావ్వయ్యే!' అంది అంబిక ఆ పిల్ల చీరని ముట్టుకు చూస్తూ.

'కూర్చో' అందా పిల్ల చిరునవ్వుతో.

'ఎందుకు నీ టైము వేస్టు చెయ్యడం. కూసే గాడిద మేసేదాన్ని చెడగొట్టినట్టు నీ చెవిన ఓ మాట వేసి పోదామని వచ్చానమ్మాయ్! సమయానికి దొరికావు. అదృష్టం బాగుంది,' అంది, సంబరపడుతున్నట్టుగా.

'చెప్పు, ఏమిటి సంగతి' అందా పిల్ల చెప్పుల్లో కాళ్ళు దూరుస్తూ.

'మరేంలేదు! మీ ఆఫీసులో ఏదో ఖాళీ వుందిటగదా! మా తమ్ముడు ఒహడున్నాడోయ్. నీకు తెలుసుగా మా నాన్నగారి కేమో పక్షవాతం. లేవలేరు. వాడే ఇల్లంతా ఈదుకు రావాలి. నానా ఇబ్బంది పడుతున్నారు. కాస్త వాడికేదయినా ఇప్పించగలవేమోనని! నువ్వా సహాయం చేస్తివా బతికున్నన్నాళ్ళు

నీకు ఋణపడి వుంటారనుకో!' అంది అంబిక ప్రాధేయంగా.

'ఓ అదా? అప్లై చెయ్యమను. అందరితో పాటు అతనికి ఇంటర్వ్యూ వుంటుంది. అదృష్టం ఉంటే రావచ్చు.' అందా పిల్ల గ్రామఫోను రికార్డులా.

'సరేలే! ఈ కళ్ళతుడుపు పిలుపులు, మన్ను మశానం. దిబ్బ దిరిగుండవును ఎందుకోయ్! నువు పూనుకుంటే తప్ప కుండా మా చిన్నిగాడికి వస్తుందనుకో! అంత పెద్ద ఆఫీసరుగారికి సెక్రెటరీ వయ్యె! నీకా మాత్రం ఇన్ఫ్లుయెన్సు లేదంటే నమ్మనోయ్! ఏమయినా సరే! నీ తమ్ముడే అనుకుని ఈ సహాయం చేసిపెట్టావంటే...!'

వీధిలోంచి కారు హారను మోగింది. ఆ పిల్ల హడావుడిగా 'అలాగే, అలాగే' అంటూ తాళం చేత్తో పుచ్చుకుంది. ఇహ వెళ్ళు అన్నట్టుగా చూసింది.

'అన్నట్టు పొద్దున అబ్బిగాడి బామ్మ, బాబిగాడి పిన్ని......' అంటూ వదల కుండా నుంచుంది అంబిక.

'అలాగే. అలాగే వాళ్ళకి ఇప్పిం చను' అంటూ ఇంటికి తాళం వేసిందా పిల్ల.

'గుర్తుంచుకో చిన్నిగాడి సంగతి' అంటూ కేకేసింది అంబిక.

'అలాగే, అలాగే' అంటూ పరుగు పెట్టి కారెక్కింది. కారు అహ మేఘాల మీద దూసుకుపోయింది.

* *

ఆ పిల్ల రోజూలాగే వయ్యారంగా వచ్చి కారెక్కింది. కారు ఆహమేఘాలమీద దూసుకుపోయింది.

'ఏవిటో అనుకుంటాం గానీ, సీతామ్మవారికే నీలాప నిందలు తప్ప లేదనుకో! ఇహ మానవ మాత్రుల మనగా ఎంత! ఆ ఆఫీసరుగారు చాలా మంచివాడల్లే వున్నాడు. లేకపోతే ఒంటరి ఆడపిల్ల పది మైళ్ళు పోయి పని చేసి రావటమంటే మాటలా ప్రతి రోజునూ! ఆ ముసలాయన పాపం కన్నతండ్రిలా పొద్దునా సాయంత్రం తీసుకుపోయి దింపుతూ వుంటాడు. ఏవిటి అంతమాత్రానికే పాడు మాట లనాలా? వెధవ ప్రపంచం. ఛండాలపు లోకం' అన్నారు బామ్మగారు నిట్టూ రుస్తూ.

'నిజమే బామ్మగారూ! పాపం తండ్రికి బోలెడంతమంది సంతానంట! తన పెళ్ళికూడా మానేసి, పాపం సంపా దించి కుటుంబాన్నాదుకుంటుంది. అట్టాంటివాళ్ళు నూటికి కోటికి ఒకరుం టారనుకోండి పాపం అయినవాళ్ళం దరినీ వదిలి ఈ దూర ప్రదేశంలో ఏవిటి కడుపు కోసం యాతన' అంటూ వంత పలికారు ఆదిలక్ష్మమ్మగారు.

'నిజమే పిన్నిగారూ! పాపం దేముడల్లే ఆ ఆఫీసరుగారు కాబట్టి లిఫ్టు ఇస్తున్నాడు గానీ, లేకపోతే బస్సుల కోసం నిలబడి నిలబడి ముసలాళ్ళం

అవ్వాల్సిందే తప్ప, అవి మాత్రం రావయ్యే! వుంటారండీ వుంటారు. మహాత్ములు. నూటికి కోటికీ ఒహళ్ళు' అంది అనసూయ తలూపుతూ తన్మయంగా.

'నిజమే అక్కయ్యా! పాపం ఆపిల్ల క్షణం ఊపిరి పీల్చుకోకుండా పనిచేస్తుం దిట.అసల్ల పిన్నిగారూ, ఇదేం ఆషామాషీ వుద్యోగం కాదుట! ఇంటిదగ్గర పెళ్ళాం ఎంతో ఆఫీసులో సెక్రెటరీ అంతట! ఇంట్లో పెళ్ళాం నిద్ర లేవండీ, కాఫీ తాగండి, గడ్డం గియ్యండి, నీళ్ళోసుకోండి, ఆఫీసుకు పొండి, సినిమాకి తీసుకుపొండి, సింగినాదం తెండి అంటూ ఎట్టా చెపుతుందో అట్టా, సెక్రటరీకూడా ఆఫీసులో, ఆ పెద్దమనిషిని కలుసుకో, ఈ మీటింగుకి టైమయింది, ఆ కాగితం మీద సంతకం పెట్టు, ఆ వూరు పోయారా, ఈ ఊరు వాళ్ళొచ్చారు అంటూ అట్టా చెపుతుంది టండీ! ఆవిడ లేకపోతే ఆయనకి కుడిచెయ్యి పడిపోయినట్టేట! మా వారు చెపుతూ వుండారుగా ఇట్టాటివన్నీ! అన్నట్టు నలుగురూ మెచ్చుకునేట్టుగా వేషం వేసుకోవాలని గూడా ఓ రూలుందిట బామ్మగారూ ఈ వుద్యోగానికి విన్నారా?? అంటూ హరికథలా చదివింది అంబిక.

అట్లా పదిరోజులుగా అంటూనే వున్నారు; ఆ పదిరోజులూ ఆ పిల్ల అన్నం తప్ప ఇతర ఆధరువులు చెయ్యటం మానేసింది అబ్బిగాడి బామ్మగారిచ్చిన పప్పు కూరలు, బాబిగాడి అత్తగారిచ్చిన పులుసు కూరలు, నాని గాడి పిన్నిగారిచ్చిన పిండివంటలు, చిన్నిగాడి అక్క గారిచ్చిన పచ్చళ్ళ తోటి ఆ పిల్ల ప్రతిరోజూ పండగలాగా భోజనంచేసింది. పొద్దునా, సాయంత్రం అంతా తలోసారి ఆ పిల్లని రహస్యంగా కలుసుకుని, అబ్బి, బాబి, నాని, చిన్ని అని గుర్తుంచుకోమని ఓసారి గుర్తుచేసి, హెచ్చరించి పోతూనే వున్నారు. ఆ పిల్ల 'అలాగే, అలాగే' అంటూనే వుంది చిరునవ్వుతో.

* * *

అబ్బిగాడు పరుగు పెడుతూ వచ్చాడు నురుగులు కక్కుతూ. 'మాశావా బామ్మా! వాడెవడో శంకరలింగంట! వాడి కొచ్చింది వుద్యోగం' అన్నాడు ఏడుపు మొహంతో.

'హన్నా!' అంటూ ముక్కున వేలేసుకున్నారు బామ్మగారు.

'మరే అత్తయ్యా, రెండు వేల మందిలో వాడెవడో లింగంట! వాడికి దక్కింది ఆ పోస్టు కాస్తా. మహా ఆవిడేదో పొడిచేస్తుందన్నావే?' అంటూ గింజుకున్నాడు బాబిగాడు.

'ఓరి నీ! అయితే నీకు రాలేదుట్రా!' అంది ఆదిలక్ష్మమ్మగారు మొహం వికృతంగా చేసుకుంటూ.

'నిజం విన్నీ; ఆ లింగం గాడెవడో మనమయిన ఉత్తరాయణమో, ఐరువయిన దక్షిణాయనమో తెచ్చిన వాడయి వుంటాడు. అలాటి వాళ్ళవే రోజులు' అంటూ ఉస్సురన్నాడు నానిగాడు.

'అయితే నీకు రాలేదన్న మాటేగా!!' అంది అనసూయ కుతకుతలాడిపోతూ.

'నిజం అక్కయ్యా! ఆ శంకర లింగం ఆ పిల్లకి సొంత తమ్ముట్ట! వాడికి కాక మరెవరి కొస్తుంది' అన్నాడు చిన్నిగాడు నీరసంగా.

'ఆ! అ! అట్టా జరిగిందన్నమాట!' అంది అనుమానపు మొగుడున్న అంబిక.

* * *

ఆ పిల్ల రోజూలాగానే వయ్యారంగానే కారెక్కి కూర్చోగానే ఆఘ మేఘాల మీద దూసుకుపోయింది రాజహంస లాటి కారు.

'మాయదారి కాలం! మంచి పోతోంది! హవ్వ! హవ్వ! ఎంత ఆఫీసరయినా తండ్రంత వయసువాడు! వాడితోనా!! ఛీ! ఛీ! ముదనష్టపు జన్మ,' అంటూ తుపుక్కున వుమ్మేశారు బామ్మగారు.

'పెద్ద రోగం కాదుటండీ! తండ్రి నిక్షేపంలాగా పెళ్ళిచేస్తానే తల్లీ అంటే వినకుండా తెయ్యిమని వెలుగుతోంది వుద్యోగంట! వుద్యోగం! నేనూ చేస్తా ఇలాటి ఉద్యోగాలు లక్షాతొంభై! మానం అభిమానం వదిలేస్తే సరి' అంటూ మొహం వికృతంగా చేసుకుంది అంది లక్ష్మమ్మగారు.

"ఎంత 'సెక్రెటరీ' అయితే మటుకు ఇలాంటి భోగం ఎంతమందిక్కి పడుతుంది విన్నిగారూ!! తంచనుగా నిముషం అటు ఇటూ గాకుండా ఆ 'బాసు' గారొచ్చి వాలటం, ఇది ఇలా ఎక్కి అలా ఝూమ్మంటూ......" అంది వక్రంగా అనసూయ.

"మరీ అంత వాగాయిత్యమా!! ఆ పవిట ఒంటి పొరన ఏడవకపోతేనేం! నిండుగా కప్పుకు చావరాదూ? ... నేనే ఆ ఆఫీసరు పెళ్ళాన్నయ్యుంటేనా..." అంటోంది అనుమానపు మొగుడి అంబిక.

ఆ పిల్ల వయ్యారంగా కారెక్కి ఆఘ మేఘాలమీద దూసుకుపోతూనే వుంది.

